# గృహాన్వేషణ

రచన:
ఆర్. యం. చిదంబరం

పెళ్లయింది. ఆశయాలలో ఒకటి వదలుకోవలసివచ్చింది. ఏ ఆశయాన్నయితే సాధించాలని బల్లగుద్ది వాదించానో ఆ ఆశయానికి స్వస్తిచెప్పవలసివచ్చింది. ఇంట్లోవాళ్లపోరు, బయట పెద్దలపోరు సహింపలేక అయిష్టంతో సంసారసాగరంలో కాలుపెట్టాను. నన్ను అదోకలాచూస్తూ ప్రక్కనున్న అవధానులతో 'బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా దోషమే!' అనేవాడు శాస్త్రి. (పెళ్ళికాకపూర్వం సుమండి) పెళ్లయినవెనుక నేనంటే చాలా అభిమానం కనబరుస్తున్నాడు.

పిల్లలు కలుగటం, ఆపైన సంసారభారాన్ని నెత్తిన వేసుకోటం. ఈసంగతు లటుంచండి. దీనికింకా కొంత టైముంది. కాని ఇంతలోకే మరోచిక్కు వచ్చింది. పట్నంలోనే ఉద్యోగం. 'ఉద్యోగం పురుషలక్షణం' అన్నారు కనుక భార్యకోసం ఆ ఉన్నవుద్యోగాన్ని వదలుకోవటం అవివేకం. 'పట్నంలో అద్దెయిళ్ళు దొరకవ'న్నమాట మెదడులో మెదలుతూనే ఉంది. ఎన్నడూ ఆసంగతి ఆలోచించే అవసరం నాకు కల్గలేదు కాని ఇప్పుడు పెద్దబరువే నెత్తినపడింది. ఆమె కాపురానికి వస్తుందట! అందుకని వేరేయిల్లు అద్దెకు సంపాదించాలి. కనీసం నాలుగుగదులున్న భాగమయినా లభించాలి. క్రొత్తకాపురం గనుక ఆ గదులు ఎలాటివైయుండాలో ఆమె వర్ణించింది. ఊరిచివరా ఉండకూడదు. ఊరిమధ్యా ఉండకూడదు. ఎలక్ట్రిసిటీ, కుళాయి అన్నీ ఉండాలి. అద్దాల మేడైతే మరీమంచిది. ఈ వర్ణన వినేసరికి గుండె ఆగింది. కాని ఆపాటి ప్రయత్నం చేయకపోతే 'నాభర్త అప్రయోజకుడు' అని ఆమె చాటుతుంది. అందరిలోనూ కాకపోయినా తమ్ముడితోనూ, చెల్లెలితోనూ అంటుంది. వాళ్లతో పోరుపడలేము కనుక గృహాన్వేషణకు బయలుదేరాలి.

బయలుదేరాను. మొదటిసారిగా అద్దెయిళ్ళు వెదకటానికి బయలుదేరాను. ఇంతవఱకు స్నేహితుడి రూములో ఉంటున్నాను కనుక ఈబాధ తప్పింది. కాని ఇప్పుడు తప్పదు. నేస్తంతో ఈసంగతి చెబితే 'నీమొహం! ఇంతపెద్ద పట్నంలో ఇళ్ళెక్కడ దొరుకుతాయి? దొరికినా తక్కువ అద్దెలుండవు' అన్నాడు. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టయింది.

ఆవీధిలో మొదటియిల్లు 'టు లెట్' బోర్డు గాలికి అటూ యిటూ ఊగుతోంది.

'ఏమండోయ్!' మొదటిపిల్పుకు సమాధానం రాలేదు. రెండోపిలుపుకు 'ఎవరండి?' అని సన్ననికంఠం లోపలినుండి వినిపించింది. మరుక్షణంలో ఒక జవ్వనియెదుట ప్రత్యక్షమయింది.

"ఇల్లు చూపిస్తారా?" అనడిగాను.

అదేంఖర్మమో! ఆమె హఠాత్తుగా నునుసిగ్గు నభినయిస్తూ వయ్యారంగా 'లోపలికిరండి' అని ఆహ్వానించింది. నేను సంశయిస్తూనే లోపల అడుగుపెట్టాను. తిన్నగా హాల్లోకి తీసుకుపోయింది. అక్కడ సోఫాలో కూర్చోమంది. తను ఎదురుగా కూర్చుంది. అయోమయంగా ఏమీ అర్థంకాక గ్రుడ్లప్పగించి చూస్తున్నాను. ఆ రకం కాదుగదా? ఏమో! ఎవడు చూశాడు?

"అద్దెకిల్లుకావాలండి. అద్దెకిచ్చేభాగం చూపిస్తారా?" అనడిగాను ఎట్టకేలకు.

"చూపిస్తానుకాని మీరొక్కరేనా?"

"ఏమండీ! అలాగడుగుతున్నారు?"

"మీకు భార్య పిల్లలువుంటే ఇల్లివ్వనండి. మీరొక్కరయితేనే యిస్తా" అన్నదామె కళ్ళు గమ్మత్తుగా త్రిప్పుతూ. నా సందేహం తీరిపోయింది.

"నాకందరూ ఉన్నారండి" అని బయటకు త్రోవతీశాను. ఆమె నావైపు వింతగా చూస్తోంది.

సరే ఒక ప్రయత్నమైపోయింది. ఇక ఆ వీధిలో రెండోయిల్లు 'టు లెట్'బోర్డు వ్రేలాడుతూంది. నాప్రయత్నం సఫలం చేయమని దైవానికి దండంపెట్టాను. ఇంటి యజమాని అరుగుమీదనే ఉన్నాడు. నా సంగతి విన్నవించుకున్నాను.

"మీకు భార్యాపిల్లలు అందరూ ఉన్నారా?"

"ఉన్నారండి" అన్నాను.

"అయితే ఇస్తాను. అద్దె నలభై రూపాయలు. కాని ఒకముక్క చెప్పవలసినబాధ్యత నామీదుంది. ఈ తూర్పు వైపుగదిలో అంటే మీ భాగానికి దగ్గఱగానే ఇద్దరు బ్రహ్మచారులు చదువుకుంటున్నారు. మీ కభ్యంతరం లేకపోతే రావచ్చు" అన్నాడింటాయన.

తెల్లబోయాను. ఇదొక క్రొత్త అడ్డంకు. బ్రహ్మచారు లంటే సంసారులకు భయం. తమభార్యలుపోతుంటే కొంటె

చూపులు విసురుతారని, ఇంకా ఎన్నోచేస్తారని సంసారుల భయం. ఆ భయంతోనే ఇంటాయనకు సమాధానం చెప్ప కుండా తిరుగుముఖంపట్టాను.

ఆమె ఉత్తరం వ్రాసింది. పాపం! బాధపడుతూనే వ్రాసింది. నేనువెళ్ళి నెలయింది కాని ఏ ఇల్లు కుదర్ప లేదట. దానికి నేనేంచేయను? కొద్దిగా నిందాపూరితంగా కూడా ఉంది లేఖ. వాళ్లతోటలో మల్లెపూలు తెగపూస్తున్నా యట. తోటివారంతా అలంకరించుకుంటున్నారట. 'ఆ పూ లన్నీ నేనుపెట్టుకుంటే ప్రయోజనమేముంది?' అని ప్రశ్నిం చింది. చివరికామెను మల్లెపూలుకూడా పెట్టుకోనివ్వకుండా చేస్తున్నానన్నమాట. ఈ సమస్య తేల్చేయాలని నిశ్చయిం చుకున్నాను.

నాకు అండగా ఉన్నవాడు నా రూంమేటు. వాడి సహాయం అర్థించాను

"నీ తెలివి ఎంతవఱకుందో తెలిపోయింది. ఇక నా తడాఖా చూడు" అని బయలుదేరాడు. ఆమెలేఖ మరొక సారి చదివి ముగించేలోగా వాడువచ్చాడు.

"రేపు సాయంకాలానికి ఈ వీధి చివరనున్న సుంద రంగారి ఇల్లు ఖాళీఔతుంది. సామానంతా సర్దుకుని రెడీగా ఉండు. ఆలస్యం చేశావంటే అవస్థపడతావు" అన్నాడతను.

"ఆ యింట్లోవున్న పర్మనెంట్ ఉద్యోగి చంద్రయ్య ఎక్కడికి పోతాడు?"

"వాడికి ట్రాన్స్ఫరయింది."

నేను నమ్మలేదు. కాని మరునాడువెళ్ళి చూచేసరికి ఇల్లు ఖాళీగా ఉంది.

"ఒరేయ్! నేనొక చిన్న సలహాయిస్తాను. అది విన్నా వంటే నీకీయిల్లు దక్కుతుంది. ఈవేళే ఇంటాయనకు ఎడ్వాన్సు చెల్లించి ఇల్లు సంవత్సరానికి రాయించుకో. నా మాట నిర్లక్ష్యం చేశావంటే రేపు నారూముకు మళ్లీవస్తావు" అన్నాడు నేస్తం. వాడిమాట యెన్నడూ జవదాటి యెరు గను కనుక వాడిసలహా ఆచరణలోపెట్టాను. భార్యామణిని తీసుకురమ్మని ఆమె తండ్రికో ఉత్తరంరాసి పడేశాను.

రెండురోజులుపోయాక ఇంటిముందు బండినిల్చింది. ఆమె వచ్చింది. ఆ బండి వెనకాలే మరో రెండు బళ్ళు వచ్చాయి. నేను ఆశ్చర్యంగా చూస్తూంటే చంద్రయ్య, అతని కుటుంబం దిగారు. చంద్రయ్య నాకేసి కొరచూపులు చూస్తూ ఇంటాయనను పిలిచాడు.

"సుందరంగారూ! చూశారా ఎంత మోసంజరిగిందో? నాకు ట్రాన్స్ఫరయిందని టెలిగ్రాం వచ్చిందికదూ! అది మా ఆఫీసునుండి రాలేదుట. వారు నన్నెక్కడికీ ట్రాన్స్ ఫర్ చేయలేదట! ఇదంతా ఎవరో పన్నాగం పన్నారు. మళ్లీ మీయిల్లు అద్దెకివ్వాలి. ఏం పాడుకాలమండి" అన్నాడు చంద్రయ్య ఇంటాయనతో.

# పసిడి పలుకులు

★ మానెం లింగరాజు ★

★

1 అపురూప సౌందర్యవతియైనను స్వకాంతను ఏవగిం చుకొని, కురూపియైనను పరకాంతనే పురుషుడు వెనుకాడునట్లు ఊరనున్నవారు పండితశ్రేష్ఠులేయై నను, వారిని నిరసించి పొరుగూరనున్నవారు పామర పండితులేయైనను వారినే గౌరవింతురు ప్రజలు.

2 భర్త జాత్యంధుడైనచో భార్య యందచందములు వ్యర్థమైనట్లు, అవివేకులైన మనుజులకడ పెద్దలు వుపన్యసించువాక్యములు వ్యర్థములేఅగుచుండును.

3 మద్యపానసేవనము, జూదము, కలహము, నిద్ర, పరసతీభోగవాంఛ యివి మానవులకు సేవించుకొలది వృద్ధియే యగుచుండును.

4 దుర్జనుడు బలవంతుల జోలికి పోలేక బలహీనునే నాశనమొనర్ప సమకట్టినట్లు, దేవత తన బలికొరకు సింహము, పులి, ఏనుగు, గుర్రము మొదలగు బలిష్ఠ మృగములను విడిచి దుర్బలిష్ఠమగు మేకనేగోరును.

5 పాములను పూజించువారున్నారుగాని ఏనుగులను పూజించువా రెచ్చటైననున్నారా? అట్లే దుర్మార్గు లను గౌరవింతురుగాని మంచివారలను గౌరవించు వారు ఉండరు.

---

"అరెరె. మీభాగం ఈయన కద్దెకిచ్చేశానండి. ఎడ్వా న్సుకూడా ఇచ్చేశారు. ఇంకెలాగ? మీరు తొందరపడి ఇల్లు వదలుకున్నారు. క్షమించండి. నేను చేయగలిగిన సాయ మేమీలేదు. ఇంతకీ టెలిగ్రాం ఎవరిచ్చారో?"

"దీనివల్ల లాభంకలిగేవారే చేసివుంటారు" అని నాకేసి గ్రుడ్లు వురిమిచూచాడు. ఇంతలో నామిత్రుడు మరోఇద్దరు మిత్రులను వెంటేసుకుని సైకిలుమీద శరవేగంతో వచ్చి వాలాడు. నాకు సాయంచేయటానికి అవుసరమైతే పోట్లాడ టానికి (చంద్రయ్యతో) వచ్చినట్లున్నాడు. వాళ్ళనిచూచి చంద్రయ్య తగ్గాడు.

"ఈ సామాను మీయింట్లో ఉంచండి. మావాళ్ళను కూడా మీ యింట్లో ఉండనివ్వండి" అన్నాడు చంద్రయ్య. ఇంటాయన 'సరే' నన్నాడు. అతను గృహాన్వేషణకు బయలుదేరాడు.

మావాడి పన్నాగం నాకిప్పుడే అర్థమయింది.